# కొలుపులు

'దీన్ని, దీని కొడుకుతోనే మానభంగం చేయిత్తా!' ఉరిమి చెప్పాడు నాంచారయ్య. వాడి చింతినిప్పులవంటి గుడ్లు, గండ్రగొడ్డళ్లవంటి మీసాలు చూస్తే పిల్లలకు దడ, వాడి చరిత్ర తెలిసి పెద్దలకు హడలు.

నల్లమ్మను జుట్టు పట్టుకొని ఈడ్చుకు వస్తుంటే, ఆమె ముసలి అత్త అడ్డం పడితే, చాచి తన్నగా ఎగిరి గుడిసెలో పడింది. ఆమెను లాక్కొనివచ్చి దేవర చెరువు గట్టుమీద ఉన్న దేవర వేపచెట్టుకింద ఉన్న దేవర-పోతురాజు-గుడిముందు కట్టిపడేశాడు.

నల్లమ్మ వెనక మాదిగపల్లెవాళ్ళు పిల్లలూ, ముసలివాళ్ళూ గుంపులు గుంపులుగా వచ్చి, గుడి దగ్గర గుమిగూడారు. నాంచారయ్య నమ్మినబంట్లు ఎరగుడ్లోడు, మిడిగుడ్లోడు, నెత్తురు గుడ్లోడు వెంట లేరు. వాళ్ళారోజు ఊళ్ళోనే లేరు.

ఆరోజు పోతురాజు కొలుపులు. లింగడు మాదిగల పూజారి. అతడు చనిపోగా గుడికి పూజారి లేకపోయాడు. ఆ పదవి వంశపారంపర్యంగా వచ్చే హక్కుగా ఉంది. ఆ హక్కు పొందటానికి పద్దెనిమిదేళ్ళు దాటిన పూజారి కొడుకో తమ్ముడో దాయాదో ఉండాలి. లేరు. ఎవరూ పూజారిగా రాలేదు. పదవి ఖాళీగా ఉంది. ఏటా జరిగేకొలుపులు ఆగిపోయాయి.

అందువల్ల ఈ అరిష్టం సంభవించిందని మాదిగలు మధనపడుతున్నారు. లింగడి మరణం వల్ల ఆగిపోయిన కొలుపుల ప్రభావం అతడి భార్య అయిన నల్లమ్మ బతుకు బుగ్గిచేస్తూ ఉందని వాళ్ళు నమ్ముతున్నారు.

నల్లమ్మ కొడుకు పేరు పోతురాజు. తమ ఇలవేలుపు పేరు పెట్టుకొన్నారు కొడుక్కి నల్లమ్మ లింగడు. లింగడు చనిపోయేనాటికి కొడుక్కు పన్నెండేళ్ళు. భార్యకు ముప్ఫయేళ్ళు. ఆరేళ్ల నుంచి కొలుపులు లేవు. గుంటూరులో హాస్టల్లో ఉండి చదువుకొంటూ ఇంటరు పరీక్షలు రాసిన పోతురాజు కొలుపులు జరిగినా, జరక్కపోయినా, ఆరోజుకు తప్పనిసరిగా స్వగ్రామం వస్తాడు.

ఇప్పుడు నల్లమ్మను రక్షించే వాళ్ళు లేరు. వద్దని ఎవరైనా అంటే వాళ్ళ నాలుక కోస్తాడు నాంచారయ్య. చేయిపట్టి ఆపితే చేయి నరికేస్తాడు. దూరం నుంచి తిట్టినా, దూషించినా, శపించినా, జుట్టు పట్టుకొని ఈడ్చి తెచ్చి గుడిముందు పడేసి వాళ్ళను ఉతికి ఆరేస్తాడు. ఏమి చేసినా చూస్తూ ఉండటమే. కాదంటే లోపల్లోపల తిట్టుకోవటమే!

'పోతురాజు గోడింకా రాలేదా?' నాంచారయ్య అడిగితే గుంటూరు రైలు రాలేదన్నారు.

లింగడు పోతురాజు పూజారిగా వందల కోళ్ళు, గొర్రెలు, దజన్ల దున్న కుర్రల్ని దేవర గుడికి బలి ఇచ్చాడు. పుంజుకోళ్ళ మెడ కొరికి బలిచ్చి నెత్తురు పోతురాజుకు తాగించి కోణ్ణి ఆకాశంలోకి విసిరివేసేవాడు. మేకపోతుల్ని, గొర్రెపొటేళ్ళని, మద్దుగత్తితో నరికేవాడు. దున్న కుర్రల్ని కొంగకాలు కత్తితో మెడతెగగొట్టేవాడు. దేన్నయినా ఒక వేటుకే నరకాలి. నరక్కపోతే వదిలేయాలి. అపుడు అరిష్టం. ఏ ఏడయినా నాలిగింటిని నరకలేకపోతే పూజారిని ఊరినుంచి తరిమేస్తారు. బలి ఇచ్చిన జంతువు నెత్తురు పోతురాజు విగ్రహం తాగాలి. తాగకపోయినా, నెత్తురు విగ్రహంమీద పడాలి. మేకపోతుల, గొర్రెపోతుల, దున్నపోతుల నాలుకాళ్ళు నాలుగు తాళ్ళతో గట్టి నాలుగు పక్కలకు లాగి పట్టుకోగా, మెడకు కొమ్ములకు ఉచ్చువేసి కట్టినతాడు ముందుపక్క గుంజి పట్టుకోగా పోతు మెడ బలిబండమీద ఉండగా పూజారి ఒకే వేటుతో మెడ మొండెం వేరుచేస్తాడు. రక్తం చిమ్మించి కొడుతుంది. పోతురాజు నాలుకమీద రక్తం పడుతుంది. భూతప్రీతి.

నాంచారయ్య పెద్దరైతు. మోతుబరి. చూడటానికి కాటిపాపోదు లాగా ఉంటాడు. పగలు కొత్తవాళ్ళు చూస్తే-రాత్రి కలలోకి వస్తాడు. మాటకోసం గొంతు పిసుక్కుంటాడు. పెత్తనం కోసం ప్రాణం తీస్తాడు. మాట చెల్లించుకొనే మొండిఘటం. వాడు అనుకొన్నది చేసితీరాలి. వాడి మాట నిలబెట్టే నమ్మినబంట్లు త్రిమూర్తులు. వాళ్ళు ఆరోజు ఊళ్ళోలేరు, వేరేపని పురమాయించడంవల్ల.

నాంచారయ్యకు తిరుగులేదు. అడ్డంలేదు. వాడు ఆడింది ఆట. పాడింది పాట. పులిని పిల్లి అంటే అది పిల్లే. పిల్లిని పులి అంటే మరిక అది పులే! తెలిసినవాళ్ళు వాడు పులిలాగా కనిపించే పిల్లి అంటారు. పిరికి సన్యాసి అంటారు. పిరికితనమే నేర జీవితానికి పునాది అంటారు. బలహీనత కప్పిపుచ్చుకొనే ప్రయత్నమే హింసాప్రవృత్తి అంటారు. అతడిమాట కాదన్నవాళ్ళు లేరు.

నల్లమ్మను నాంచారయ్య జుట్టుపట్టి ఈడ్చి తెచ్చి గుడిదగ్గర పడేస్తే, కుదేస్తే మాట్లాడినవాళ్ళు లేరు. చూస్తూ ఊరుకొన్నారు. వాళ్ళు చూడకపోతే తన ప్రతాపం ప్రచారంకాదు కాబట్టి వాళ్ళను చుట్టుపక్కల ఉండి చూడనిస్తున్నాడు కానీ లేకపోతే 'ధూత్తేరి' అంటేవాళ్ళు పారిపోరా?

గాలానికి తగులుకొన్న చేపలాగా గిలగిలకొట్టుకొంటుంటే ఆమె తలే నొప్పి పుట్టింది. నల్లమ్మ పెడబొబ్బలు పెట్టి, ప్రాణం పోతున్నట్లు అరుస్తుంటే అతడికి జాలిలేదు. ఎవరూ రక్షించలేరు.

ఎవరూ వెంటరాకపోతే నల్లమ్మను  ఏంచేసేవాడోకానీ, వాళ్ళంతా వెంట ఉండటంతో గుడి దగ్గర కట్టిపడేశాడు. కొలుపుల రోజు బలికి తోలుకువచ్చిన జంతువులాగా పోతురాజు ముందు పడి ఉంది నల్లమ్మ.

జనం గుంపులు గుంపులుగా పల్లెనుంచి ఊరునుంచి దేవరగుడికి వస్తున్నారు. వచ్చి చూడటమే కానీ ఎవరమేమీ చేయలేరు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేరు. చేసి బతకలేరు. పోలీసులు కూడా ఊరికి రారు. వస్తే నాంచారయ్యకు మేలుచేసి, బహుమతులు తీసుకొని పోతారు.

లింగదున్నంతకాలం ఇల్లు వదిలిపోని నల్లమ్మకు భర్త చావుతో చావొచ్చిపడింది. పదిహేనేళ్ళకు పెళ్లయింది. మరి పదిహేనేళ్ళకు ముండమోసింది. కూలిపనులు చేసుకొంటూ కొడుకును చదివిస్తూ జీవిస్తూ ఉంది. ఒక్కడే కొడుకు.

నల్లమ్మకే తిప్పలు. నిప్పులాంటి వంశంలో పుట్టింది. గారాబంగా పెరిగింది. అగ్గిలాంటి పూజారి ఇంటికోడలయింది. ఎండకన్నెరగకుండా బతికింది. భర్త పోయాడు. ఒంటరిబతుకు. కష్టాలకంప. బంగారం వంటి కొడుక్కోసం బతుకు వెళ్ళదీస్తూ ఉంది.

తల్లిదండ్రులు రమ్మన్నారు. కొడుకును వదిలిరానంది. మళ్ళీ పెళ్ళి చేస్తామన్నారు. వద్దని తెగేసి చెప్పింది. కొడుకును, అత్తను చూసుకొంటూ మొండిగా బతుకుతూ ఉంది.

పద్దెనిమిదేళ్ళకే కొడుకు చెట్టంత మనిషి అయ్యాడు. చేయెత్తు తేలాడు. మారుమనువు మాటెత్తకుండా మెట్టినింట గుట్టుచప్పుడు కాకుండా, కలోగంజో తాగి, కాళ్ళు మునగరదీసుకొని కాలం వెళ్ళబుచ్చుతూ ఉంది నల్లమ్మ.

నల్లమ్మ నలుపే! నల్ల నేరేడు పండులాగా నిగనిగలాడుతూ ఉంది. మిసమిసలాడే వళ్ళు పనిపాటలతో రాటుదేలిన అవయవాలు. ఎత్తులావు ఒద్దూ పొడుగు ఉన్న నల్లమ్మను ఒకసారి చూస్తే మళ్ళీ చూడబుద్ధిపడుతుంది. ముప్పైఆరేళ్ళ వయస్సు. ఆరేళ్ళనుంచి భర్తలేదు.

పూజారి వారింటి కోడలు కావటంవల్ల మాదిగ పల్లెలో ఆమె అంటే ఆత్మీయంగా ఉంటారు జనం. కూలీనాలీ పనుల్లో రైతులు ఎగాదిగా చూడకపోలేదు. ఆకర్షణను ఇదిమిపట్టుకొని మూసిన గొడుగులాగా జీవిస్తూ వుంది నల్లమ్మ.

నల్లమ్మమీద నాంచారయ్య కన్ను పడింది. మోజుపడ్డాడు. హెచ్చరించాడు. ఛీకొట్టింది. ఆ పొగరుకూడా అతడికి ఇష్టమయింది 'ఏ రోజుకన్నా, నువ్వే నా పక్కలోకి వత్తావే!' అన్నాడు.

నల్లమ్మను నాంచారయ్య ఏంచేసినా ఎవరూ ఏమీ అనరు. అడ్డంలేదు. మానభంగం చేయవచ్చు. ఎత్తుకుపోవచ్చు. ఇంట్లో పెట్టుకోవచ్చు. ఏమీ చేయలేదు. 'ఏ నాటికయినా అదే వచ్చుద్ది' అని అతడి నమ్మకం.

పోతురాజు జూనియరు కాలేజీలో చేరేటప్పుడు డబ్బు అవసరమై నల్లమ్మ తెలిసిన వాళ్ళందరినీ అడిగింది. వాళ్ళు లేదంటే నాంచారయ్య ఇచ్చి, సంవత్సరంలోపల అప్పు తీర్చాలని పత్రం రాయించుకొన్నాడు.

నల్లమ్మ అప్పు తీర్చింది కానీ పత్రం తెచ్చుకోలేదు. సంవత్సరం నుంచి 'నా అప్పు మాటేంచేశా' అని అడుగుతున్నాడు. 'తీర్చానుకదా' అంటుంది. 'ఆ అప్పుకాదు, ఈ అప్పు అంటు'న్నాడు. నేనేం 'నీకప్పులేను' అంటుంది నల్లమ్మ.

మాదిగ పల్లెలో ఎండాకాలం రాత్రి ఎవరూ ఇళ్లలో పడుకోరు. గాలాడదు. ఉక్క. నిద్ర పట్టదు. కొత్తగా పెళ్ళయినవాళ్ళ తిప్పలు వాళ్ళు పడతారుకానీ అందరూ బైటే నిద్ర!

ఒకరాత్రివేళ నల్లమ్మ మంచం కాళ్లకట్టకాడ నుంచి కట్టుబట్ట కొంగులాగినట్లయి తుళ్ళిపడి లేచింది. ఎదురుగా ముసుగేసుకొన్న మనిషి ఆకారం. మొదట దెయ్యమనుకొంది. అరవబోతే ఆకారం నోరుమూసింది. నల్లమ్మ బలం ఆ మనిషి బలం ముందు చాలలేదు. అరవలేదు. దెయ్యం కాదు మనిషని గుర్తించింది. ఆకారం మీద పడుతున్నట్లుంటే కాలు చాచి ఎదురురొమ్ముమీద ఎగిరిచ్చి తన్నింది. 'దొంగ' 'దొంగ' అంది. చుట్టుపట్టుల జనం లేచారు. 'దొంగ' 'దొంగ' అన్నారు. కుక్కలు లేచాయి. అరుస్తున్నాయి. జనంగోల! కుక్కలు వెంటబడుతుంటే మనిషి ఆకారం ఊళ్ళోకి పరుగెత్తింది. అది నాంచారయ్యే అని నల్లమ్మ నెమ్మదిగా గ్రహించింది.

ఉదయమే నాంచారయ్య వచ్చి తన అప్పు తీర్చమని ఒత్తిడి చేశాడు. తాను 'డబ్బు కట్టా'నంది. 'నాకు ముట్టలేద'న్నాడు నాంచారయ్య. ప్రమాణం చేసింది. అతడు పట్టించుకోలేదు. ఉన్నపళాన కక్కమన్నాడు. లేకపోతే మనిషిని కట్టేసి డబ్బు వసూలు చేసుకొంటానన్నాడు. వాళ్ళు వీళ్ళు అడగ్గా రెండు రోజులు గడువిచ్చాడు.

నల్లమ్మకు పల్లెలో డబ్బు పుట్టలేదు. మాదిగలు పేదలు. ఏమిలేనివాళ్ళు. పనులు లేనికాలం. రెక్కాడితేకాని డొక్కాడని జీవితాలు. చేతిలో తడిలేదు. సర్దలేకపోయారు.

నల్లమ్మ డబ్బు రైతుల్ని అడిగింది. లేనివాళ్ళు లేదన్నారు. ఉన్నవాళ్ళు కూడా లేదన్నారు. ఇచ్చిన డబ్బు చెల్లించినా ఇవ్వలేదని గొడవపెట్టుకొంటున్న నాంచారయ్యతో వైరం తెచ్చుకోవటం ఇష్టంలేక, వాడసలే కయిరగొండివాడని, ఎందుకొచ్చిన తలనొప్పి అని డబ్బు సర్దలేదు.

ఇల్లు తాకట్టు పెడతానన్నా, అమ్ముతానన్నా అప్పు పుట్టలేదు. గడువు ప్రకారం వచ్చాడు. డబ్బు ఇవ్వనక్కరలేదు. వచ్చి తీర్చమన్నాడు. నల్లమ్మ ఏడ్చింది. పోతురాజు కొలుపులు దాకా గడువు. ఆరోజు దాకా నువ్వు రాకపోతే నీకు మానభంగమే అని వెళ్లాడు.

నలుగురూ పోగయి బాధపడుతుంటే 'నాకు ఇవాళ డబ్బు అయినా కావాలి. లేదా కొలుపులనాడు దానికి మానభంగమయినా కావాలి. దాని కొడుకు కొలుపులకు వస్తాడు గందా' అంటూ వెళిపోయాడు.

పోతురాజు కాయేదు  కొలుపులు లేవుకాని, నాంచారయ్య పోతురాజులాగా మారి, నెత్తురు తాగే రాయి అయ్యాడు. ఉదయమే నల్లమ్మను జుట్టుపట్టి ఈడ్చితెచ్చి పోతురాజు గుడికాడ కట్టేశాడు.

ఇంటరు పరీక్ష వ్రాసిన నల్లమ్మ కొడుకు పోతురాజు ఆరోజు ఊరికి రాకుండా ఉంటే బాగుండునని పల్లెజనం అనుకొంటున్నారు. దీనికొడుకు వస్తాడుకదా అని నాంచారయ్య ఎదురుచూస్తున్నాడు.

పోతురాజు గుంటూరు నుంచి తెనాలి పోయే రైలులో వేజండ్లలో దిగి జాంకాయ కొరుకుతూ ఉన్నాడు. తల్లికి పట్టిన దుర్గతి తెలియదు. నాంచారయ్య తీర్చిన బాకీ తీర్చమంటున్నాడని మాత్రం విన్నాడు.

జాంకాయ పెద్దది. పచ్చిది. గట్టిగా రాయిలాగా ఉంది. నోటికి అమరటంలేదు. కొరుకుడుపడటం లేదు. గీరుకుపోతుంది. జారిపోతుంది కానీ నోటికి అమరటం లేదు.

జాంకాయతో నోరు కుస్తీ పడుతుంటే పోతురాజు వస్తాదులాగా రైలుదిగాడు.  దానిని రాయితీసుకుని పగలగొట్టి తినవచ్చు. కాని పళ్ళతో కొరికే దాన్ని తినాలని వాడి పట్టుదల.

చెరుకుగడలు చిన్నప్పుడే నోరు పుండు కాకుండా కస్తాబిసా నమిలేవాడు. ఎముకల్ని పళ్లకింద పెళపెళలాడించి నమిలేవాడు. పళ్ళు ఇనప చక్రాలకింద ఏంపడ్డా పిండిపిండి అయిపోయేవి. అట్లాంటిది ఒక జాంకాయ తనను అవమానం చేయటమా?

గీరుకుపోయిన ఏ పట్టునో వీలుచిక్కి పళ్లకింది కొచ్చి కొరికితే జాంకాయ పెచ్చు లేచింది మళ్ళీ కొరికితే మరో పెచ్చు లేచింది. తింటుండగానే పెచ్చులు లేచిన జాంకాయ బద్దలయింది. ముక్కలయింది. నలిగిపోయింది. నమిలేశాడు. రాయిలాంటి జాంకాయ మాయం.

రైలు పట్టాలుదాటి,  ఎందుకో పల్లెలో ఇంటికి పోకుండా, దేవర చెరువు గట్టుమీద దేవరవేప చెట్టుకింద పోతురాజు గుడికాడికి చేరాడు. జనం మూగి ఉండటం చూశాడు. ఈ ఏడు కొలుపులు జరుగుతాయా అని ఆశపడ్డాడు. తాను, తన తండ్రిలేనప్పుడు, పూజారి కాగలడుకానీ, తాను లేకుండా, తనకు తెలియకుండా కొలుపులు ఎలా జరుగుతాయి?

జనం లేచి వచ్చి పోతురాజుకు విషయం చెప్పారు. తల్లి గుడికాడ ఉంది. నాంచారయ్య 'రారా' అంటున్నాడు. పోతురాజు గుండె భగ్గుమంది.

తల్లి అవమానంవల్ల పోతురాజుకు ఆగ్రహం వచ్చింది. తన అసహాయతవల్ల ఏడుపు వచ్చింది. మగపిల్లవాడు కావటంతో ఏడుపు ఆక్రోశమయింది. పోతురాజు కోపంతో ఊగిపోతున్నాడు.

నేలమీద ఉన్న తల్లి కాళ్ళ చేతుల కట్లు విప్పబోయాడు. నాంచారయ్య అడ్డం వచ్చాడు.

'అప్పుతీరుత్తాం- మనిసిని కట్టేత్తావా?' అని అడిగాడు.

'గడువు దాటింది. ఇప్పుడు అప్పయినా తీర్చు. లేదా దీన్ని మానభంగమయినా చేయి. నీకు చేతకాకపోతే చెప్పు. నేను మానభంగం చేస్తాను.

పోతురాజు 'ఆమె మా అమ్మ. నా తల్లి, నా దేవత' అని బావురుమని ఏడ్చాడు. ఎంతోసేపు ఏడుపు ఆపుకోలేకపోయాడు.

గుళ్ళో పోతురాజు ఎర్రగా చూస్తున్నాడు. గుడిముందు పోతురాజు ఏడుస్తూ నిలబడ్డాడు.

'ఈ ఎండాకాలం నీ బాకీ దీరుత్తా! మా అమ్మను వొదులు!'

'గడువు లేదు!'

'ఇప్పుడెక్కడతేనూ?'

'లేకపోతే మానభంగం చేయి. చేతగాకపోతే చెప్పు!'

నల్లమ్మ ఏడ్చి ఏడ్చి నిలువుగుడ్లు పడి చూస్తూ ఉంది.

పోతురాజు తల్లి కట్లు విప్పబోయాడు. నాంచారయ్య కొడుకును లాగి పక్కకు పడేశాడు.

'కొడతావా? కొట్టు!'

'మరోసారి దాని కట్లు విప్పబోతే కొట్టేదే!'

'కొట్టు!' చేతుల కట్లు విప్పజూసాడు.

నాంచారయ్య మాట తప్పని మనిషి. ఒకే ఏటు పోతురాజు అంతదూరంలో పడ్డాడు.

ఎత్తుండటానికేమో వాడు నాంచారయ్యంత ఎత్తున్నాడు. బలమూ అంత ఉంది. అయితే నాంచారయ్య అనుభవశాలి. పోతురాజు పసివాడు. వాడికి ధైర్యం ఎక్కువ. వీడికి భయం ఎక్కువ . వాడు హత్యలు చేశాడు. చేయించాడు. వీడు పుస్తకాలు నమిలి మింగాడు. పరీక్షలు పాసయ్యాడు. వాణ్ణి వీడేం చేయగలడు? విసిరేస్తే అంత ఎడంగా పడ్డాడు.

'అమ్మా! నాకోసం అప్పుచేసేవు. తీర్చావు. అయినా మోసపోయేవు. నావల్లే నీకీ గతి! దేవుడున్నాడు. పోతురాజు న్యాయం చేస్తాడు' అన్నాడు.

తల్లి ఏడుస్తూ ఉంది.

'ఏంచేస్తాడురా నీ పోతురాజు న్యాయం?' అని మండిపడుతున్నాడు నాంచారయ్య.

'మీరు పెద్దోళ్ళు! మేం సిన్నోళ్ళం! మీరు మమ్మల్ని దయతో చూడాలి. మీకు దణ్ణం బెడతా! మా అమ్మను వదులు!'

'వొదులుతానంటిని గదరా!'

'మరి వొదలండి!'

'రెండు! చెప్పానుగా! ఏదో ఒకటజరగాలి!'

'నాంచారయ్యగోరూ!'

'మనిసికోమాట-గొడ్డుకోదెబ్బ. చెప్పాను గదరా! చెప్పినట్లు చేయి. వడ్డీ అసలు పూర్తిగా మాఫీ!'

ఎవరూ మాట్లాడలేదు. బువ్వేల అయినా ఎవరూ ఇళ్ళకు వెళ్ళలేదు.

నల్లమ్మ ఏడుస్తూ కూలబడే ఉంది.

'ఆమె నా తల్లి! నన్ను కన్నతల్లి! కూలీ నాలీ చేసి పెంచుతున్న తల్లి! తల్లే దైవం అంటారే! మీ అమ్మనెవరైనా ఇంతమాట అంటే నీకెట్టా ఉంటుంది నాంచారయ్య గోరూ!'

'నోర్మూయ్‌రా గాడిదా' అని మాడుమీద ఒక్కటేశాడు. 'మా అమ్మతో మీ అమ్మను పోలుత్తావా? సంపేత్తా!'

'తల్లి ఎవరికైనా తల్లే గదండీ!'

'మా అమ్మకు మాదిగదానికి సాటా? పోటా?'

'మీ తల్లి మీకెంతో నాతల్లి నాకంతే కదండి!'

పోతురాజు కళ్ళు తిరిగినట్లయింది. స్పృహ తప్పేట్లుగా అనిపించింది.

పోతురాజుకు దెబ్బరుచి మొదటిసారిగా తెలిసింది. తండ్రి కొట్టలేదు. తిట్టలేదు. తల్లి దీవించింది. లాలించింది. మాష్టర్లు ప్రేమగా చూచుకొన్నారు. పూజారికొడుకని పల్లెవాళ్ళు ఆదరంగా పలకరిస్తారు.

పోతురాజుకు ప్రేమ తెలుసు. దెబ్బ తెలియదు. దెబ్బ కలిగించిన నొప్పి కంటే తననొకడు కొట్టాడన్న నొప్పి తీవ్రంగా ఏడిపిస్తూ ఉంది. కళ్లు ఎర్రబడ్డాయి. పోతురాజు గుడ్లు మాదిరిగా ఉన్నాయి.

'మా అమ్మమీద నీకు కామం ఉంది' అన్నాడు పోతురాజు.

నాంచారయ్య బిత్తరపోయి చూశాడు.

'నన్ను పెంచింది. పెద్ద చేసింది. నన్నింక ఆమె రక్షించనక్కరలేదు.'

అయితే ఏమి అన్నట్లు చూస్తున్నాడు నాంచారయ్య.

'నేనీరోజునుంచి, మా అమ్మకు పరిరక్షకుణ్ణి. నేను అనుమతి ఇస్తున్నాను'

ఏమిటిరా నీ బోడి అనుమతి అన్నట్లు చూశాడు నాంచారయ్య.

'మా అమ్మను తీసుకుపో! ఇంట్లో పెట్టుకో! లేదా నువ్వే మా యింటికిరా! నా ఇల్లు నీకు రాసిస్తా! మా అమ్మను నువ్వు పెళ్ళిచేసుకో!'

నాంచారయ్య బిత్తరపోయాడు.

'ఏమిట్రా?' అన్నాడు.

'ధైర్యంగా నీ కామం తీర్చుకో! అధర్మంగా నీతి లేకుండా ప్రవర్తించవద్దు'

నాంచారయ్య ఉన్నట్టుండి భళ్ళున నవ్వాడు.

'కామం నిజమే! ప్రేమ అబద్ధం. దాన్ని కట్టుకోను. ఉంచుకోను. అనుభవించి వదిలేత్తా'

'పురుగులు పడి సత్తావ్!'

'రేయ్!' అని మీదికివస్తే 'ఆగునాంచారయ్య' అన్నాడు పోతురాజు. బిత్తరపోయాడు నాంచారయ్య.

'నా తండ్రీ! పెద్దవాడివయ్యావా నాయనా. నన్ను కాపాడే తండ్రివయినావంటరా తండ్రీ! నేనింక నా జన్మలో ఇంకెవడికీ పెళ్ళాం కాలేను తండ్రి! మీ నాయనతో కాపరం చేసిన ఆడది మరే మగాణ్ణయినా పురుగులాగా చూస్తుంది తండ్రి! వీడొక మగాడను కొంటున్నావా తండ్రి... వీడు నీచుడు పురుగు. కుక్క'

'ఒసేయ్!' నల్లమ్మను కాలితో తన్నాడు.

'నాంచారయ్యా!'

'ఏం చేస్తావురా?' ఒక్క వేటు వేశాడు. ఆదెబ్బతో అంతదూరం పోయాడు.

ఊళ్లోనుంచి మునసబు వచ్చాడు. వెంట కరణం, వెట్టి, తలారి, మోతాదు వచ్చారు.

నాంచారయ్యకు మునసబుమీద చాలా కాలంగా కోపం ఉంది. సిస్తు వసూలు దగ్గర వచ్చిన పేచీలు గొడవలు. నాంచారయ్యను మునసబు మందలిస్తే, మునసబును ఏమీ చేయలేక ఊరికే ఉన్న నాంచారయ్యకు, అతడిమీద పీకలదాకా కోపం ఉంది.

'తల్లినీ కొడుకునూ విడిచిపెట్టు!' అన్నాడు మునసబు.

'వదలను!'

'ఎందుకు?'

'నా బాకీ!'

'గడువు ఇవ్వు!'

'ఇవ్వను.'

'ఇది అడివిగాదు ఊరు!'

'ఊరు అడివి అవుద్ది జాగర్త!'

'ఇది అరాచకం! తగదు!'

'ముగ్గురు పెళ్ళాల ముండమోపోడివి నువ్వా నాకు నీతులు చెప్పేది?'

'కామంతో కళ్ళు గానకపోతే దాన్నీ కట్టుకో, ఈ పరాభవం పనికిరాదు'

'పోవాయ్ నువ్వేంది నాకు జెప్పేది'

'ఏమిరా మాటలు మీరుతున్నావ్!'

'ఏదో ఊళ్ళోబడి ఉండక, యెందుకొచ్చేవీడకి? తగాదా పెట్టుకొంటావా? కొడతావా? రా కొట్టు!' అంటూ మునసబును చెంపమీద కొట్టాడు. ఊహించని సంఘటన.

మునసబు ముసలివాడు, తూలికింద పడ్డాడు.

కరణం లేపాడు. వెట్టివాళ్ళు పట్టుకొన్నారు.

'నీకు చావు మూడిందిరా!' అన్నాడు మునసబు.

'సంపుతావా? సంపు' అంటూ మీదికి పోతుంటే వెట్టివాళ్ళు ఆపి, 'ఉందు దొర! ఎందీ రంధి' అన్నారు.

'నీకీ ఆంము తగదు నాంచారయ్య. పెద్ద మనిసి అనికూడా చూడకుండా అంతేటు ఏసేవే మునసబును. నీకు సెద్దకాలం వచ్చింది' అన్నాడు కరణం.

'ఒరే కరణం! ఏంజేత్తార్రా మీరు? పొండిరా పొండి!'

'నాంచారయ్యా! రాక్షసులందరూ కుక్కచావు చచ్చారు. మనిసిగా చావు!'

'పోరా ముసలినక్కా?' అని అరిచాడు నాంచారయ్య.

గుమిగూడిన మాదిగల్ని చూస్తూ 'మీలో ఎవరూ వీణ్ణి సంపగలిగేవోళ్ళు లేరా? కేసుండదు' అని మునసబు గావుకేక పెట్టాడు.

'నువ్వు రారా సంపుదువుగానీ–' అని మునసబుమీదికి పోబోయాడు.

'మీరే సంపలేకపోతే పేదోళ్ళం మేమేడ సంపుతాం దొర!' అన్నారు మాదిగలు.

నాంచారయ్య ఆమాట విన్నాడు.

'ఎవుడ్రా కూత కూసింది' అన్నాడు. గప్ చిప్. ఎవరూ పలకలేదు.

పెద్దమనిషి, మునసబు, మాటపోయి, మర్యాదపోయి, దెబ్బతిని, ఏమీచేయలేక, న్యాయం చెప్పలేక, చెప్పిన మాట నిలబెట్టుకోలేక అసహాయ్యంగా వెళిపోయాడు.

మునసబుకు అవమానం జరిగిందని విని ఊరి యువకులు వచ్చి, నాంచారయ్య పనిపడతారని మాదిగలు ఆసక్తిగా నిరీక్షిస్తున్నారు.

ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చి రక్షిస్తారని ఎదురు చూడటానికి, సాంఘికంగా, ఆర్థికంగా, బలహీనులయిన మాదిగలు, అలవాటుపడిపోయారు.

కీడుమూడకుండా తమనుతాము రక్షించుకోవచ్చునని, వాళ్ళకిప్పుడప్పుడే తట్టేటట్టుగా లేదు.

పోతురాజును పట్టుకొని, ముందుకు లాక్కొని వచ్చి, 'దీన్ని రేప్ చేయరా!'

'నాంచారయ్యా!' అరిచాడు పోతురాజు

'ఏమిరా ఉరిమి చూస్తున్నావు'

'నీకిది నేయంగాదు!'

పొద్దువాలిపోయింది.

'రేప్‌చెయ్!'

'మా అమ్మ! నా తల్లి! నా దేవత!'

'లే! పా!'

పోతురాజును ముందుకు తోశాడు

'నడువ్! దానికట్లు ఇప్పు'

'ఇప్పుతాను!'

'కాళ్ళు కట్లు!'

విప్పాడు!

'చేతుల కట్లు'

'ఇప్పుతున్నాను'

నేలమీద కూలబడి ఉన్న నల్లమ్మ లేచి నిలబడింది.

'దాన్ని నేలమీద పండబెట్టు!'

పోతురాజు ముందుకు పోలేదు.

'చెట్టుకింద పండబెట్టు!'

నల్లమ్మ ఏడుస్తూ ఉంది.

'నిన్నే!' నాంచారయ్య నెట్టాడు. పోతురాజు రాయిలాగా నిలబడ్డాడు . కదల్లేదు.

నాంచారయ్య చెయ్యిపట్టి గుంజాడు.

'నావల్ల కాదు!'

'నేలమీద పడేస్తావా? లేదా?'

పోతురాజు మాట్లాడలేదు.

'నువ్వు నేలమీద పడుకోవే!'

నల్లమ్మ తటపటాయించింది.

'పొడుకుంటావా లేదా?' ఒక్కటేశాడు. 'పొడుకో' అన్నాడు. నల్లమ్మ ఏడవలేదు. చెంపవాపు తడుంకొంటూ ఉంది. పడుకోకపోతే మళ్ళీ కొడతాడు. తననే కాదు కొడుకును కూడా కొడతాడు.

'దాని పడేత్తావా లేదా?' పోతురాజు మీదికిపోయాడు. కొడుకును కొడతాడనిపించింది. 'నేనే పడుకుంటున్నా' అంది.

మాయల ఫకీరు ప్రాణం ఏడేడు సముద్రాల కవతల లంకలో మర్రిచెట్టు తొర్రలో ఉండే చిలక గుండెలో ఉందని తెలిసినట్లుగా నల్లమ్మ అంగీకరించటం పోతురాజును కొట్టటంలో ఉందని నాంచారయ్యకు అర్థమయిపోయింది.

చెంపమీద, వీపుమీద, పొట్టమీద, నడుంమీద ఇష్టమొచ్చినట్లు కొట్టాడు. తన్నాడు.

నల్లమ్మ అల్లాడిపోతూ ఉంది. 'నేను పొడుకున్నా, ఆణ్ణెందుగ్గొడతన్నా' అంటూ అరిసింది.

నాంచారయ్య కొట్టటం ఆపాడు.

'నేన్నీమాటింటా ఏంచేయమంటే అదే చేత్తా, నన్నూ నాకొడుకునూ ఇడిసిపెడతావా?'

'ఇదుస్తా!'

'మాటియ్యాలి?'

'ఇత్తన్నా!'

'నాగ్గాదు, నలుగురికీ!'

'సెబుతా!'

'సెప్పు!'

నాంచారయ్య వెళ్ళి గుమిగూడి ఉన్న మాదిగలతో 'అది నా మాటింటే, దాన్ని, మీ కళ్ళెదటే కొడుకుతో పాటు వదిలేత్తా! సరేనా?' అని అడుగుతున్నాడు. చెబుతున్నాడు.

వాళ్ళు 'సరే'నంటూ ఉన్నారు.

ఆ సమయంలో తల్లీ కొడుకులు మాట్లాడుకొంటున్నారు.

'కొడుకా! నువ్వు పారిపోరా!'

'నిన్నీ పాపిస్టోడికి బలిచ్చి నేను బోలేను.'

నల్లమ్మ క్షణకాలం ఆలోచించింది.

'నువ్వటు పారిపో! నేనిటుబోతా'

'ఆడెంట బడ్డా?'

'పడతాడు!'

'దొరకంవా?'

'నన్నొదలడు! నన్ను బట్టుకొత్తాడు. నువెళ్ళిపోవచ్చు'

'నిన్నొదిలి నేను బోను'

'ఇద్దరిమీ సత్తాం!'

'సద్దాం!'

'సావటం గొప్పగాదు కొడుకా! బ్రతకటం గొప్ప! ఇద్దరమీ బతకాలి'

'ఆడితో సచ్చే సావయిందిగదే! ఆడు మనల్ని బతకనీడు.'

'ఏందే మీలో మీరు గుసగుసలాడతా ఉందారు?' అంటూ నాంచారయ్య వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

'ముదనష్టపోడా! గుసగుసలేముంది? నేనా సన్నాసోడికాడికి పోతానని నా కొడుకు అనుమతి తీసుకొంటా ఉండా!'

అమ్మా వద్దు అనవోయి, అమ్మ ఏదో ఆలోచిస్తూ ఉందని నోరు మెదపలేదు పోతురాజు.

'యేంటీ! ఒప్పుకొంటా ఉండావా? ఇంత రగడ యెందుకే! ముందే ఈ ముక్క నా సెవిలో యేసి ఉండొచ్చుగందే!' అంటూ సంతోషంగా వాళ్ళ దగ్గరకు పోయాడు.

పోతురాజు దూరంగా జరిగాడు.

'నీ కొడుకుతో మానభంగం చేయించుకుంటావా?'

'ఆడు నా కొడుకు. బంగారు తండ్రి! పసోడు. ఆడెందుకు నువ్వుండగా'

'యేందే?'

'ఆడుగాదు. నువ్వు కావాలి!'

'రైటయిన మాటన్నావే గాడిద ముండా!'

నాంచారయ్య చాలా కుశాలగా ఉన్నాడు.

'మీ ఇంటికి పోదాం పద' అంది నల్లమ్మ.

'కాదు!' అన్నాడు

'మా యింటికి పోదాంరా'

'రాను!'

'మరి?'

'నేను మాటన్నా, నీ కొడుగ్గానీ, నేను గానీ' నీన్నిదే మానభంగం సెత్తామని-నేను మాట తప్పేనా, కొడుకును గాను'

'ఈడా?' నల్లమ్మ నోరు నొక్కుకొంది.

పొద్దు మునిగి చాలా సేపయింది. చీకటి ముసురుకొంటూ ఉంది.

'నీకు సిగ్గుందా నాంచారయ్యా!' అంది.

'యేయ్' అన్నాడు.

'ఇనవయ్య పెద్ద మంచి, యెంత యిడిసేసిందయినా, బజారుదయినా, పదిమందిలో మొగోడికాడ పడుకోటం సూశా?'

'సూళ్ళా!'

'మరి ఆళ్ళనన్నా దూరంగా బంపిచ్చు. నన్నన్నా యాడకన్నా దూరంగా దీసుకెళ్ళు.'

'ఆళ్ళంతా సూత్తావుంటేకదా నా పెగ్గె!'

'నాంచారయ్యా! ఏమొగోడన్నా, నడీదిలో ఆడమనిషికాడ పొడుకోటం ఏడన్నా సూశా!'

'సూళ్ళా!'

'నీ మాట నెగ్గాలంటావు. అట్టయితే ఈడే నీ యేడుపు ఏదో యేడువు. ఆళ్ళ నీడ నుంచి యెల్లిపొమ్మను.'

నాంచారయ్య చుట్టూ మూగి ఉన్న జనం దగ్గరకు పోయాడు. ఏందిరా! ఏందే! యేంది జూత్తన్నారు. పొండెహే పొండిళ్ళకి.

వాళ్లు కదిలారు.

'యేందా పెళ్ళినడకలు. బిరిబిరిన పొండి!'

వాళ్ళు నడుస్తున్నారు.

'మీగ్గూడా సెప్పలా యేరా! పొండెహె!'

చుట్టూ గుమిగూడిన జనం కదిలి, దూరంగా పోయి నిలబడ్డారు.

నాంచారయ్య గుంపును తరుముతున్నప్పుడు నల్లమ్మ కొడుకుతో చెప్పింది.

'ఆడు మొండినాబట్ట! నన్నొదలడు. అది నువ్వు సూడలేవు. నాకర్మ మిట్టా తగలబడింది. కాదంటే ఇద్దరినీ సంపుతాడు. నువ్వెల్లిపో! నా సావు నేను జత్తాను.'

'నేను పోను! నీ కాడే ఉంటా!'

'ఆడు నన్నేమన్నా సేత్తే నేను బతకను. నే జత్తా!

'నువ్ జత్తే నిన్ను బతికిచ్చులేని నేను బతికేఁవి, సచ్చేఁవి!'

'కాదంటే మనల్ని ఆడు జంపుతాడు. అవునంటే మనంతట మనమే జత్తాఁవు. ఎటుదిరిగీ సచ్చేది తప్పనప్పుడు ఆణ్ణి సంపి, ఈలయితే సంపి, ఒక్కణ్ణీ సంపి, మనం ఇద్దరం బతికేది సాద్దేవా?'

'సొద్దంవే!'

'ఆడు బలముండోడు!'

'ఉణ్ణీ!'

'ఆడొత్తన్నాడు!'

'రానీ!'

'యాందే? యేందో గట్టిగానే ఆలోసిత్తా ఉండారు.'

నల్లమ్మ ఏడిసింది.

'ఏంవాలోసెన, నాబొందాలోసెన. ఆలోసెన లేదు. పాడులేదు. ఇక్కడ నువ్వొద్దు పోరా అంటుంటే ఈడు నామాటింటంలా. పోనంటన్నాడు. పొమ్మని సెప్పు. ఆణ్ణి పంపెయ్.'

నాంచారయ్య దీర్ఘంగా ఆలోచించాడు. 'ఈడు పోరాదు' అన్నాడు. 'ఈడూ జూడక, ఎవుడూ జూడక, నా మాట ఏంనెగ్గినట్లు?' అని అడిగి 'ఆడుండాలి. సూడాలి. గుండె బగిలి సావాలి' అని తేల్చాడు.

తల్లి కొడుకులు లోపల్లోపలే మల్లగుల్లాలు పడ్డారు. నాంచారయ్య చాటుకు పోగానే 'నేనాణ్ణి సంపిసత్తా! నువ్బో!'

'యట్టా సంపుతా!'

'సంపుతాగా!'

'నువొవ్వక్కదానివే సంపులేవు, నేనూ నీకు తోడుంటా'

'సూళ్ళేవురా!'

'సూళ్ళేకపోటం రోసం రాటం మేలే!'

'మరి నీ బుద్ధి బుట్టినట్టు సెయ్‌రా'

పోతురాజు ఏమీ మాట్లాడలేదు. తండ్రి లింగడు గుర్తుకు రాసాగాడు.

తండ్రి బతికుంటే తల్లికీ గతి పట్టేది కాదు. కొలుపుల గొడ్డును నరికినట్లు నాంచారయ్యను నరికిపారేసేవాడు. వీడు అసలు ఇంతధైర్యం చేసేవాడుకాదు తండ్రి బతికుంటే! అసలు అప్పులు చేయవలసిన అవసరం వచ్చేదికాదు. తిప్పలుండేవి కావు.

తండ్రి ఉంటే కొలుపులు పండగలుగా జరిగేవి. ఆ ఉత్సాహం లేదు. ఉత్సవం లేదు. మేళతాళాలు లేవు. పెట్రోమాక్సు లైటు లేవు. వేపాకులు లేవు. పసుపు బొట్లు లేవు. కోడి పుంజులు, మేకపోతులు, గొర్రెపోతులు, దున్నపోతులు, పోతురాజు బలికి రాలేదు. నెత్తురు కారలేదు.

ఏడ్పులు, పెడబొబ్బలు, అవమానాలు, మానభంగం. కొడుకుండి అంగీకరించవలసి రావటం. కన్నీరు రక్తంలా కారసాగింది.

నల్లమ్మ ఆలోచనల్లో నల్లమ్మ ఉంది. 'పసివాణ్ణి గొడ్డును కొట్టినట్లు కొట్టేడు. కుక్కను తన్నినట్లు తన్నేడు. దెబ్బలు తిని ఎరగని బిడ్డ. పసివాడు. ఎన్నిపాట్లు పడవలసి వచ్చింది. మొదటి దెబ్బకు అల్లాడిపోయిన కొడుకు ఆపైన కోపం తెచ్చుకోలేదు. రోషం చూపలేదు. ఏడవలేదు. మొద్దులాగా, మానులాగా, రాయిలాగా నిలబడి దెబ్బలు తిన్నాడు. వాడిచేతులు పడిపోను! వాడికి చావుమూడా! వాడి పుటమారిపోను! వాడి వంశం నాశనమయిపోను!' శాపనార్థాలు పెడుతూనే ఉంది. పోతురాజు పగలబోయే అగ్ని పర్వతంలాగా ఉన్నాడు. దేవుడు ఏమీ మాట్లాడకుండా బొమ్మలాగా, రాయిలాగా మిడిగుడ్లేసుకొని చూస్తున్నాడేకానీ, నాలిక చాపుతూ ఉన్నాడేకానీ మాట్లాడడు. వారించడు. మాహాత్మ్యం కల్ల దేవుడయితే నాంచారయ్యను చంపొద్దూ. తాము చావకూడదు. వాడు చావాలి. మండిపోతూ వుంది నల్లమ్మ.

పోతురాజు తండ్రి కోడి మెడ కొరికి నెత్తురు పోతురాజు విగ్రహానికి తాగించే దృశ్యం గుర్తుకు తెచ్చుకొంటున్నాడు.

ఊరిజనం దూరంగా పోయారు. పల్లెజనం అక్కడా ఇక్కడా నిలబడి చూస్తున్నారు.

'పొందుకోవే' అన్నాడు నాంచారయ్య.

మారు మాట్లాడకుండా నేలమీద పడుకొంది నల్లమ్మ.

'యెల్లికిల దిరగవే' అన్నాడు.

చెప్పినట్లు విని వెల్లకిల తిరిగిపడుకొనే ఉంది.

'నువ్విడే ఉండరా! యేడికీ బోవద్దు. అటు దిరగొద్దు. ఇటేజూడు. యేడికయినా పోయేవో, సంపుతా'

'పోను!' అన్నాడు పోతురాజు.

గుళ్ళో పోతురాజు నవ్వాడు.

నాంచారయ్య నల్లమ్మ కాళ్ళ దగ్గర కూర్చుని మీద పడబోతున్నాడు.

రెండు కాళ్ళు ఒకేసారి ఎత్తి బలంగా నాంచారయ్య ఎదురొమ్ముమీద తన్నింది నల్లమ్మ.

అంతలావు మగవాడు, వెల్లకిల పడ్డాడు. వాడు లేవకముందే వాడిమీద పోతురాజు పడ్డాడు. నాంచారయ్య తల జుట్టు పట్టుకొని వెనక్కు విరగదీసింది నల్లమ్మ.

పోతురాజు నాంచారయ్య చేతులు వెనక్కు విరిచి, నేలకానించి, తన రెండు చేతులతో గట్టిగా అదిమి పట్టుకొన్నాడు. నాంచారయ్య మెడ తన నోటికి దగ్గరగా ఉంది.

లేవలేని నాంచారయ్య మెడ కదలక, చేతులాడక కాళ్ళతో ఇద్దరినీ తన్నాలని తన్నుకులాడుతున్నాడు.

పోతురాజు నోరు నాంచారయ్య గొంతకోలుమీద ఉన్నప్పుడు నల్లమ్మ అతడి తలవదిలి, కాళ్ళ దగ్గరకు వచ్చి, చేతులతో కాళ్ళు అదిమిపట్టి కాళ్ళతో నాంచారయ్య మొలమీద కసిగా, ఇల్లు అలకటానికి, పాటిమట్టి, పేడ కలగలిపి పోవటానికి కసాబిసా తొక్కుతున్నట్లు, తొక్కసాగింది.

కొలుపులు జరిగిన రోజుల్లో లింగడు కోడికాళ్లు అదింపట్టి, ముక్కు వెనక్కి విరిచి, గొంతుకోలు నోట కరుసుకొని, పైపళ్ళు పైన, కింది పళ్ళు కింద ఉండేట్టుగా పట్టుకొని కసుక్కున  కొరికి, నోటి కొచ్చినంత ముక్క తుపుక్కున ఉమ్మేస్తే చిమ్మించి కొట్టే నెత్తురు గుడిలోని విగ్రహం చాపిన నాలికమీద పెడితే, పోతురాజు తాగినంత తాగి, మిగిలిందంతా శరీరానికి రాసుకొన్నట్లు జారిపడగా, మెడ విరిగిన కోడిని విసిరిపారేస్తే, అది గిలగిలా కొట్టుకొని, సప్పగా సచ్చి పడిపోతుంది. పడిపోయింది శవం.